కారులు .... మేడలు .... హోదా.... అంతస్తు.... యివేమీ గుర్తురాలేదు పోతురాజుకి.

ఏడుస్తూ పరిగెడుతున్నాడు; కింద అడ్డంగా పడున్న రాళ్ళను తప్పుకుంటూ. పిచ్చివాడిలా పరిగెడుతున్నాడు. పరిగెడుతున్న పోతురాజు కొయ్యబారిపోయాడు, ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి.

రక్తసిక్తమైన దేహంతో, ఉండచుట్టుకుని పడున్నాడు దేవుడు. అతన్లో జీవం లేదు. ఆ దేహంలో చలనం లేదు.

శ్వాస ఎప్పుడో ఆగిపోయింది. కొద్ది క్షణాలక్రితం యాభై రూపాయలకోసం ఆరాటపడ్డ అతనిలో యిపుడు ఎలాంటి ఆరాటమూ లేదు; ఆవేదనా లేదు.

నిశ్చలంగా .... నిశ్శబ్దంగా పడి ఉన్నాడు.

చితికిపోయిన మాంసపు ముద్దలా ఉందా దేహం.

ఆ మాంసపు ముద్ద కౌగిటిలో సురక్షితంగా, పదిలంగా ఒదిగి ఉంది, భయంతో ఏడుస్తున్నాడు పోతురాజు ముద్దులకొడుకు రవిబాబు. ఆ ఘోర కృత్యాన్ని చేసిన నేరస్తుల్లా చుట్టూ, చెల్లాచెదురుగా పడివున్నాయి పెద్దపెద్ద రాతిబండలు....

పోతురాజు గుండెలాంటి నల్లటి రాతిబండలు....

....జరిగిపోయిన ఘోరానికి పశ్చాత్తాపంతో కన్నీరు కారుస్తున్నట్టు నల్లటి రాతిబండలపై ఎఱ్ఱటి రక్తపు ఛారికలు... పోతురాజు కళ్ళల్లో కన్నీళ్ళలా.



Book Lending Library

# ఆకలి



## వాట్ల నారాయణమూర్తి రాజు

కృష్ణబాబు బాగుంటాడు. అతను చాలా చక్కగా వుంటాడు. అతను అందంగా నవ్వుతాడు. హుందాగా నడుస్తాడు. వంకీల జుత్తు, అంతంత పెద్ద కళ్ళు, వెడల్పాటి నుదురు, ఎఱ్ఱటి ముఖం, ఆరడుగుల ఎత్తు, అతని ఠీవిని తెలియబరుస్తుంటాయి. అతను విదేశాల్లో చదువుకున్నాడు. అందువలన కొన్ని నియమాలు పాటిస్తుంటాడు. ఉదయం ఎట్టి పరిస్థితుల్లోనూ తొమ్మిది గంటలకు ఇంటినుంచి బైల్దేరతాడు. సాయంత్రం మళ్ళీ ఐదు గంటలకల్లా ఇంటికి వచ్చేస్తాడు.

సమయాన్ని అనవసరంగా బైట గడపటం అంటే అతని కిష్టంలేదు. అతను తక్కువగా సినిమాలు చూస్తాడు. ఎక్కువగా ఇంట్లో టెలివిజన్ చూస్తాడు.

ఎవరైనా స్నేహితులొస్తే తప్పనిసరి పరిస్థితుల్లో ఇంగ్లీషు సినిమాలకు మాత్రమే వెళ్తాడు. తెలుగు సినిమాల్లోని సెంటిమెంట్స్ అతని కసహ్యం. అతని కేఁవీ తోచనపుడు క్లబ్బుకెళ్తాడు. మనసు మరీ చికాగ్గా వున్నప్పుడు మందు పుచ్చుకుంటాడు. అదీ విదేశీ మందుకే అతను ప్రాముఖ్యత ఇస్తాడు.

ప్రస్తుతం కృష్ణబాబుకి మనసంతా చికాగ్గా వుంది. ఉదయంనుంచీ అలాగే వుంది. ఆఫీసులో ఏఁవో గొడవలు. మరి అక్కడ వుండలేక త్వరగా ఇంటి కొచ్చేసాడు. ఇంటిదగ్గర కూడా అలాగే వుంది. క్లబ్బుకి వెళ్దామనుకున్నాడు. ఎందుకో వెళ్ళాలనిపించలేదు.

సముద్రాని కెదురుగా ఆ భవనం ఒంటరిగా వుంది. అక్కడి వాతావరణం కూడా నిశ్శబ్దంగానే వుంది. గదిలో ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని భరించలేక కృష్ణబాబు బాల్కనీలో కొచ్చి నిలబడ్డాడు.

ఎదురుగా సముద్రం తుళ్ళుతూ కేరింతలు కొడుతోంది. దూరంగా నృశింహస్వామి కొండపైకి జల్లు జల్లుగా వెళ్తున్న జనం సముద్రానికి పక్కన సరుగుడుచెట్ల దగ్గర ఒకబ్బాయి, ఒకమ్మాయి కూర్చుని కబుర్లాడుకుంటున్నారు.

వాళ్ళని చూస్తుంటే కృష్ణబాబుకి కళ్యాణి జ్ఞాపకాని కొచ్చింది.

కళ్యాణి.

బాగుంటుంది. ఆవిడ చిన్నప్పుడు కాన్వెంట్లో చదువుకుంది. పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక 'లా' చదువుదామనుకుంది. కానీ అప్పటికే తండ్రి సంబంధం చూసేసి పెళ్ళిచేసేసాడు. కానీ కళ్యాణికి చదువుకోవాలనుంది. కానీ చదువుకోలేకపోయింది. దానికి కారణం డబ్బులేక కాదు, సమయంలేక.

ఒకసారి పెళ్ళిసంబంధాలు చూస్తున్న సమయంలో ఆ అమ్మాయి తండ్రితో ఇలాగంది.

"డాడీ.... నేను పెళ్ళిచేసుకోను.... చదువుకుంటాను...."

"మన కెందుకు చదువులు.... చదువులు డబ్బులేనోళ్ళకి.... పొట్ట గడవనోళ్ళకి.... నీకు.... నీకు చదువెందుకు ....చదివింది చాలు...." అని వాళ్ళ డాడీ ఆమె మాటని కొట్టిపారేసేడు.


తర్వాత పెళ్ళయ్యాక వాళ్ళాయన్ని అడుగుదామనుకుంది. కానీ అడగలేకపోయింది.

కళ్యాణి బాగుంటుంది. సూదిముక్కు. చక్కటి కళ్ళు. నునుపుదేరిన బుగ్గలు. లేత గులాబీరంగు పెదవులు. కోల ముఖం, పిరుదుల వరకూ వేలాడే జడ. వాళ్ళాయనకు ఆవిడ పాలరాతి బొమ్మలా వుంటుంది.

ఇపుడు ఆవిడ మొదటి కానుపుకి పుట్టింటికి వెళ్ళింది.







—అలా చాలాసేపు సముద్రంవేపు చూస్తూ కూర్చున్నాడు కృష్ణబాబు.

సముద్రం పక్కన వరసగా జాలరి పడవలు. పడవలకు ఆనుకుని జాలరి జాణలు కూర్చున్నారు. వాళ్ళ కెదురుగా జాలరి కుర్రాళ్ళు వలలు నేస్తున్నారు. అప్పుడప్పుడు వాళ్ళు సరసాలాడుకుంటున్నారు. అప్పుడు జాలరి పడుచులు వాళ్ళ నుండి తప్పించుకోడానికి, ఇష్టంలేని ప్రయత్నంచేస్తూ వాళ్ళని వూరిస్తున్నారు.

వాళ్ళ మాటలు వినబడటం లేదు కా! వాళ్ళ చేష్టలన్నీ కృష్ణబాబు చూస్తున్నాడు

ఆ సముద్రానికి ఎడంపక్కన అప్పుడెప్పుడో విజయనగరం రాజుల కట్టించిన 'హవ మహల్' శిథిలమైపోయి అంచక్కా ఒంటరిగా నిలబడిన రాజలమ్మాయిలా అందంగా వుంది.

సాయంత్రం నీరెండ ప్రకృతి వేసకున్న బంగారు రంగు 'వల్లెవాటు'లా వుంది. కొండలమీద దొర్లుతున్న

సూర్యుడు ప్రకృతి పెట్టుకున్న వచ్చ బొట్టులా వున్నాడు.

బాల్కనీలోంచి గదిలో కొచ్చాడు కృష్ణబాబు.

గది గోడలకు ఆకాశ నీలం నెరొలాక్ పెయింట్ మెరుస్తోంది. గదిలో ఒక పక్క విశాలమైన యూ-ఫోమ్ బెడ్ మీద లేపాక్షి దుప్పట్లు కొత్తగా వున్నాయి. గది మధ్యన 'షాండెలీర్' అందంగా వుంది. గోడలకు నాలుగువేపుల నాలుగు 'బ్లోఅప్' లున్నాయి.

ఒకపక్క వయ్యారంగా మోడల్ గర్ల్ వీణాప్రకాష్ వీణ పట్టుకుని అంతంత పెద్దకళ్ళతో ఓరగా చూస్తోంది. రెండోపక్క అస్సాం కోడెడ్ లెపర్డ్ క్రూరమైన చూపుల్తో నిల్చుంది. మూడో పక్క ఒక కేరళ అమ్మాయి వయ్యారంగా నీళ్ళబిందె నెత్తిమీద పెట్టుకుని తడిసిన కళ్ళతో, తడివంటితో చేప పిల్లలా బెదురుచూపుల్తో చూస్తోంది. నాలుగోవేపు నిర్మల్ పెయింటింగ్ అద్భుతంగా వుంది.

గదిలో ఇంకోపక్క ఒక టీపాయ్, దానిమీద రకరకాల మేగజైన్స్, దాని చుట్టూ చక్కటి కుర్చీలున్నాయి. ఆ కుర్చీల్లో ఒక కుర్చీమీద కూర్చుని టీపాయ్‌మీద మేగజైన్‌ని అందుకున్నాడు.

డెబొనైర్.

మధ్యపేజీ చూస్తున్నాడు. జబీనా బ్లోఅప్. కొండపక్క సెలయేట్లో స్నానమాడుతూ చిట్టిపాపలా ఓ ఇరవై ఏళ్ళ పాప. ఆ అమ్మాయి వంటి అందం కన్నా ఫోటోగ్రాఫర్ నేర్పరితనం చక్కగా కనబడుతోంది.

ఎప్పుడు చీకటి పడిందో తెలీదు. గాజు దీపాల గుత్తి ఒక్కసారి మిల మిల మెరిస్తే అటువేపు చూసాడు.

ఎదురుగా పనివాడు.

"అయ్యా....టీ తేనా..." వినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు వాడు.

"వద్దులే...." పనివాడు వెళ్ళిపోయాడు.

కాసేపు ఒక్కడూ పేకాడుకున్నాడు. కేరమ్స్ ఆడుకున్నాడు. ఆ తర్వాత ఎవరో స్నేహితుడికి ఫోన్‌చేసాడు. అవతల ఫోన్ రింగయింది తప్ప ఎవరూ ఎత్తలేదు. చికాగ్గా రిసీవర్ మళ్ళీ పెట్టేసాడు.

అసహనంగా వుంది. ఇంత ఒక కంపెనీ మేనేజింగు డైరెక్టర్‌కి కాలం గడవటం కష్టంగా వుంది. లేచి సిగరెట్ వెలిగించుకుని అటూ ఇటూ పచార్లు చేసాడు. కొంతసేపు గడిచాక మేడ మెట్లు దిగి, మధ్యగది దాటి పోర్టికో దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

సిమెంట్‌బాటకి అటూ ఇటూ రక రకాలైన మొక్కలు. తోట తోటలో తోటమాలి నీళ్ళు పోస్తున్నాడు. మొక్కలకు గొప్పులు తవ్వుతున్నాడు. ఫెన్సింగ్ గేట్ తెరచుకుని తోటలోకెళ్ళి కొంత



సేపు పచార్లు చేసాడు. అక్కడ కూడా గడవటం కష్టంగా వుంది. గబగబా తోటలోంచి బైటకొచ్చాడు. ఎందుకో సముద్రం ఒడ్డుకి వెళ్ళాలనిపించింది కృష్ణబాబుకి.

"సలామ్ సాబ్...." గూర్ఖా సలామ్ చేసి ఇనుప గేట్ తెరిచాడు.

కృష్ణబాబు నడుచుకుంటూ సముద్రం ఒడ్డుకి వచ్చేడు. సముద్రమ్మీద నుంచి వచ్చేగాలి చల్లగా, చక్కగా, మెత్తగా, హాయిగా వుంది.

సముద్రం ఇసక దిబ్బలమీద నడుచుకుంటూ, కాళ్ళకి తగిలే పీతల్ని తన్నుకుంటూ హవామహల్ దగ్గర కొచ్చాడు.

చీకట్లో హవామహల్ నిజంగా దిక్కుమాలిన భవనంలాగే వుంది. హవామహల్ రెండస్తుల భవనం. మెట్లు కూడా సరిగ్గా లేవు. కానీ కృష్ణబాబుకి హవామహల్‌పైకి వెళ్ళాలనిపించింది.

గబగబా పిచ్చిమొక్కలని దాటుకుంటూ, మెట్లని చూసుకుంటూ పైకి వెళ్ళాడు. అక్కడ కిటికీలోంచి కనబడే విశాలమైన సముద్రాన్ని చూస్తున్నాడు. కెరటాలు అంతెత్తుగా ఎగిరి, పరుగుడు పందెంలో పిల్లలా ముందుకొస్తున్నాయి. వాటికి కాపలాగా వున్న నల్లరాళ్ళని ముట్టుకుని, చటుక్కున వెనక్కి తిరిగి పోతున్నాయి.

ఇటుపక్క సముద్రం, అటుపక్క సన్నని గోస్తనీనది పాయ. ఆ పాయ సముద్రంలో కలవడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తోంది.

అక్కడ అరగంటసేపు గడిపాడు. కిందకు మెట్లు దిగుతున్నపుడు, ఆ మసక వెలుతుర్లో మెట్లప్రక్క కూర్చున్న ఆకారంవేపు చూసాడు.

ఆ ఆకారం స్త్రీది. ఆ అమ్మాయికి వంటిమీద గుడ్డలేకపోయినా, వయసుతో పాటు వచ్చిన వంపులున్నాయి. మొలకి ఆ మాత్రం చిరిగిన గుడ్డని చుట్టుకుంది.

ఆ అమ్మాయివేపు మరోసారి చూశాడు కృష్ణబాబు. అదే సమయంలో ఆ అమ్మాయి అతనివేపు చూసింది.

"బాబూ.... ఆకలి .... ధర్మం అన్నా...." మెల్లగా అడిగింది. ఆ మాటని వినిపించుకోలేదు కృష్ణబాబు. గబగబా నడుచుకుంటూ, సముద్రం ఇసకపర్రల మీదికి వచ్చి అక్కణ్ణించి తన భవనానికి వచ్చాడు.

* * *

ఎదురుగా గ్లాస్ టీపాయ్. దాని మీద నాజూగ్గా నిలబడిన అమ్మాయిలా పొడవాటి గ్లాసు. ఆ ప్రక్కన గళ్ళాపెట్టి ముందు కూర్చున్న షావుకారులా షివాస్ రీగల్ బాటిలు.

ఆ గ్లాస్ తీసుకుని అందులో సగం వరకూ షివాస్‌రీగల్‌ని వంచుకుని, ఆ సీసాను పక్కన పెట్టి, గ్లాసుని నెమ్మ నెమ్మదిగా సిప్‌చేస్తున్నాడు కృష్ణబాబు.

ప్లేట్లో వున్న జీడిపప్పుని అప్పుడప్పుడు నంవుల్తున్నాడు.

వరసగా,

వరసగా నాలుగు పెగ్గులు

చిక్కగా చల్లగా గొంతులో నుండి గుండెలోకి జారి, వళ్ళంతా పాకి వెచ్చగా మత్తుగా వుంది. హాయిగా, ఆనందంగా వుంది మందు. లేచి టేప్‌రికార్డర్ ఆన్ చేసాడు.

ఉషా ఉతప్ప పాటలో జీరలు మందు కన్నా మత్తుగా, వత్తుగా వున్నాయి.

నరాలు జివ్వుమంటున్నాయి. కను రెప్పలు బరువుగా వున్నాయి.

ఐదో పెగ్ సగం అయింది.

టేప్ రికార్డర్ ఎప్పుడాగిపోయిందో తెలీదు. దీపాల గుత్తిని ఎవరార్పేరో తెలీదు. నైట్‌బల్బ్ వెల్తురులో గదంతా మత్తుగా వుంది.

నెమ్మదిగా లేచి, నడుచుకుంటూ వచ్చి, బాల్కనీ పిట్టగోడమీద కాళ్ళు పెట్టుకుని కుర్చీలో కూర్చున్నాడు.

చుట్టూ నిశ్శబ్దంగా వుంది. సన్నటి వెన్నెల సముద్రమ్మీద పడి నురగలా మెరుస్తోంది.

అలా ఎంతసేపు కూర్చున్నాడో తెలీదు.

స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్ పెట్టి ఖాళీ అయింది.

చల్లగాలి.

రొజ్జగాలి. మత్తు కమ్ముకోవడంవలన కృష్ణబాబుకి తెలీలేదు. బైట సన్నగా చినుకులు. చెయ్యి కొంచెం ముందుకు సాచాడు. ఆ చేతిమీద రెండు చినుకులు పడ్డాయి.

అప్పుడు ఆ సమయంలో అకస్మాత్తుగా ఒక్కసారి గేటు వేపు చూసాడు. ఇనపగేటు ప్రక్కన దీపం వెలుగులో మసకమసగ్గా కనబడుతూ ఆకారం.

"....టైమెంతయిందో.... ఇపుడెవ రొచ్చారు...." చేతి వేపు చూసాడు. వాచీ లేదు. వెనక్కి తల తిప్పి చూసాడు. అక్కడ గోడగడియారం కన్పించడం లేదు.

"గూర్ఖా.... ఏయ్.... అమీర్...." గూర్ఖాని పిలిచాడు. గుర్ఖా పలకలేదు.

"ఇంత అర్ధరాత్రి.... ఎవరు.... 'మనసులో అనుకుని,' ఎవరక్కడ..." అని గట్టిగా అరిచాడు కృష్ణబాబు.

గేటు దగ్గర్నుంచి ఏ సమాధానమూ లేదు.

కృష్ణబాబుకి ఏదో అనుమానం వచ్చింది. అతి ప్రయత్నంమీద లేచి, మెట్లు దిగి, పోర్టికోలో కొచ్చి మళ్ళీ అరిచేడు.

ఈసారీ సమాధానం లేదు.

కొంచెం ముందుకి వచ్చి తోట ఫెన్సింగ్ పక్కన నిలబడి అటు చూశాడు.

అక్కడ మసక వెల్తురులో ఆ వ్యక్తిని చూసాడు. గేటు ప్రక్కన వర్షం చినుకుల నుండి తప్పించుకుంటూ







ఆ ఆకారం అటూ ఇటూ కదుల్తోంది.

"ఎవరక్కడ.... ఏయ్...." గేటు దగ్గరకు వెళ్ళాడు. గుర్ఖా గేటు పక్క గదిలో గురకలు తీస్తున్నాడు.

ఆ పక్కన గేటుకి ఆవతల ఆ ఆకారం నిలబడి, కృష్ణబాబు వేపు చూసి అంది.

"వర్షం.... చలి.... దొంగదాన్ని కాదు బాబయ్యా...."

అప్పుడు కృష్ణబాబు స్పష్టంగా ఆ వెల్తురులో ఆ అమ్మాయివేపు చూసాడు.

అతనికి చటుక్కున జ్ఞాపకం వచ్చింది.

హవామహల్ అమ్మాయి.

నిండా పాతికేళ్ళు వుండవు. గుండెలు చుట్టూ రెండు చేతులూ అడ్డుగా కప్పుకుంది. పెద్దపెద్ద కళ్ళతో కృష్ణబాబు వేపు చూస్తోంది.

"ఆకలి బాబయ్యా.... తిండి తిని ఆర్రోజులైంది....అందరూ పిచ్చిదాన్నని తగిలేసారు అన్నయ్యా.... అన్నం పెట్టవూ...." ఎంతో ఆర్ద్రింగా అడిగింది.

"ఇప్పుడు అన్నం ఏంవిటి!" కృష్ణబాబు విసుక్కున్నాడు.

"పో.... పో...." వెనక్కి నడుచుకుంటూ వచ్చి, పోర్టికోలో నిలబడి మళ్ళీ గేటువేపు చూసాడు. ఆ అమ్మాయి అక్కడే వుంది ఏమాత్రం కదలకుండా.

"అన్నా.... ఆకలన్నా.... అన్నం... ఎట్టవూ...." సన్నటి చినుకుల్ని చీల్చుకుని, రొజ్జగాలిని దూసుకుని, మెల్లగా మెలమెల్లగా ఆ అమ్మాయన్న ఆ మాటలు మళ్ళీ వినబడ్డాయి కృష్ణబాబుకి.

రెండు నిమిషాలు ఆగి మళ్ళీ ముందుకి గేటువేపు నడిచి, గేటు తీసి—

"లోనికి.... రా" అని పిల్చాడు.

"అన్నం పెడతావా.... అన్న...." లోనికొస్తూ ఆశగా అడిగింది ఆ అమ్మాయి. గేటు దగ్గరికి వేసి మాట్లాడకండా ముందుకి నడిచింది.

కృష్ణబాబు గబగబా లోనికొచ్చి, మేడ మెట్లెక్కి, తన గదిలోకొచ్చి తన కోసం పనివాడు పెట్టిన అన్నం కంచాన్ని తీసుకుని, మళ్ళీ మెట్లు దిగి, కిందకు వెళ్ళాడు.

ఆ అమ్మాయి మధ్య గదిలో నేలమీద కూర్చుని వుంది. ఆ గది మధ్యలో చంద్రబింబంలా వేలాడుతూ వెలుగులు చిమ్ముతున్న దీపం వెల్తురులో ఆ అమ్మాయి వేపు చూసాడు.

ఆ అమ్మాయి అప్పుడు ఆడపిల్లలా కనిపించింది కృష్ణబాబుకు. అతను ఆ అమ్మాయి వేపు ఒక్కక్షణం చూసాడు.

అదే సమయంలో ఆ అమ్మాయి కూడా అతని వేపు చూసింది.

అప్పుడు ఆ సమయంలో ఆ అమ్మాయి పిచ్చిదో, కాదో తెలీదు కానీ పిచ్చిదాన్లాగే వుంది. రేగిపోయిన జుత్తు. చిక్కడపడితే అక్కడ దొర్లడం వలన వంటికి అంటుకున్న దుమ్మూ, ధూళి. వర్షంనీరు పడి ఇంకుతున్న వంటిమీద బురద.

మరో పరిస్థితిలో అయితే అలాంటి వాళ్ళు ఆ భవనానికి ఆమడదూరంలోనైనా వుంటారో వుండరో తెలీదు. కానీ ఇప్పుడు–

"అన్నం పెడతాను.... నే నెప్పినట్టుగా చేస్తావా...." కృష్ణబాబు కళ్ళలో ఏదో తెలీని మగవాడి కోరిక బుసలు కొట్టింది. ఆ మాట అంటున్నపుడు అతను పెదవులు తడారిపోయాయి.

"నే నెప్పినట్టుగా చేస్తావా"... మళ్ళీ అడిగాడు.

ఆ అమ్మాయేం అన్లేదు. మౌనంగా పెద్దపెద్ద కళ్ళతో, వెర్రిగా అతని వేపు చూస్తోంది.

"చుట్టూ ఎవరూ లేరు. నువ్వూ నేనే.... అన్నం తిని మేడమీదకి వచ్చెయ్.... అలాగేనా...." ఆ మాట అనేసి అన్నం కంచాన్ని ఆ అమ్మాయి ముందుకు తోసి, తను గబగబా మెట్లెక్కి వెళ్ళిపోయాడు.

వెళ్ళి, షివాస్‌రీగల్‌ని మరో పెగ్‌ని గ్లాసులో పోసుకుని సిప్‌చేసి, సిగరెట్ వెలిగించుకున్నాడు.

అతని కొక్కసారి కళ్యాణి జ్ఞాపకాని కొచ్చింది. ఆ గదిలో కళ్యాణితో గడిపిన చక్కని, వెచ్చని రాత్రులు గుర్తు కొచ్చాయి. అతనికి సంబంధం వున్న అమ్మాయిలు కొందరు ఎందుకో జ్ఞాపకం వచ్చారు. చిన్నప్పుడు పక్కింటి అమ్మాయి బాత్‌రూంలో స్నానంచేస్తున్నపుడు దొంగచాటుగా చూడడం జ్ఞాపకాని కొచ్చింది.

జ్ఞాపకాలు. జ్ఞాపకాలు. ఆనందాన్ని పొందే అనుభవానికి ముందు ఉద్రేకపరిచే జ్ఞాపకాలు.

గబగబా మరో పెగ్ వేసుకుని, కిటికీ తలుపులు దగ్గర వేసి కుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తూ ఆ చప్పుడికి తల తిప్పి తలుపువేపు చూసాడు.

తలుపు దగ్గర ఆ అమ్మాయి కంచంతో నిలబడుంది.

"అన్నం తినలేదా...." లేస్తూ అడిగాడు. ఆ అమ్మాయి సమాధానం చెప్ప లేదు. గబగబా ఆ అమ్మాయి దగ్గర కెళ్ళాడు కృష్ణబాబు.

అతను నిలదొక్కుకోలేకపోయాడు. ఆ అమ్మాయి చెయ్యి పట్టుకున్నాడు. అతని సున్నితమైన చెయ్యికి ఆ అమ్మాయి చెయ్యి మొరటుగా తగిలింది. ముందుకి లాగేడు. ఆ అమ్మాయి నీరసంవల్ల ముందుకి పడిపోయింది.

ముందుకి వెళ్ళబోయి ఒక్కసారి ఆగిపోయాడు కృష్ణబాబు. అప్పుడు ఆ అమ్మాయి అన్నమాటలు అతన్ని ముందుకు కదలనివ్వలేదు.

"అన్నా.... పేద్దాన్ని.... దిక్కుమాలి న్దాన్ని....అన్నం పెడతానంటే ఆశగా వచ్చేను.... ఇలా చెయ్యడం.... నీకు దరమమా....నీలాంటి గొప్పోడికి నేనే దొరికానా....వొగ్గేయన్నా...."

అ మాటలు విన్నాడు కృష్ణబాబు. అయినా ఆ సమయం, అతని పరిస్థితి విననివ్వలేదు. ముందుకి కదిలి ఇలా అన్నాడు.

"చూడు....ఇప్పుడు చెప్పినట్టు విను. అన్నంకాదు.... నువ్వేంకోరితే అవి యిస్తాను...డబ్బు కావాలా.." గబుక్కున బీరువా తెరిచి చేతికందిన కరెన్సీనోట్లు ఆమె ముందు విసిరాడు. ఆ అమ్మాయి మీదకు రాబోయాడు.

"అన్నా .... నీ డబ్బొద్దు .... తిండొద్దు....నన్ను పోనివ్వవూ.... నేను బీద్దాన్ని.... ముష్టిదాన్ని.... నాకు తిండా నికి తిండిలేదు.... కట్టుకోడానికి గుడ్డ నేదు....కానీ అన్నా ....నే నలాంటి దాన్ని కాదు...." ఆ అమ్మాయి ఎంత వేగిరం లేచిందో ఎలా వెనక్కివచ్చిందో తెలీదు.

కృష్ణబాబు ఆ అమ్మాయిని అందుకో బోయాడు. దొరకలేదు. గబగబా ఆ అమ్మాయి మేడమెట్లు దిగి, గదితలుపు తీసుకుని, పరుగెడుతూ ఇనపగేటు తెరచుకుని సముద్రం ఇసకదిబ్బలమీద పరుగెడుతోంది.

అద్దాల కిటికీలోంచి ఆ అమ్మాయి వెళ్తున్నవేపు అలా చూస్తున్నాడు కృష్ణబాబు. అప్పటివరకూ సన్నగా కురుస్తున్న వర్షం ఒక్కసారి ఎక్కువైంది.